కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.25, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.50, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.105, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.33, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఎల్‌ఓసీ అందజేత



చైతన్యపురి: పేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో దోహద పడుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డి అన్నారం డివిజన్ కోదండరాంనగర్ కాలనీకి చెందిన శ్రీధర్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌ఓసీ చెక్కును శనివారం బాధితుడి సోదరుడు నవీన్‌కు అందజేశారు. పేద ప్రజలకు అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే అన్నారు.

డీపీఓగా లక్ష్మీబాయి

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారిగా లక్ష్మీబాయి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన యుగంధర్ రెడ్డి మునుగోడు ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళా గ్రూపులను బలోపేతం చేస్తానన్నారు.

నియామకం



చెరుకు రామకృష్ణ

నాగోలు: జాతీయ మానవ హక్కులు, అవినీతి నిరోధక, భారత నేర వ్యతిరేక బ్యూరో ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన చెరుకు రామకృష్ణను నియామిస్తూ జాతీయ అధ్యక్షులు కే.ఎస్ జోతిశ్వర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మానవ హక్కుల సంరక్షణ, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానన్నారు.

పరామర్శ

హస్తినాపురం: స్వల్ప అస్వస్థతతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను శనివారం హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శ్రీధర్ రెడ్డి, మెరుగు రమేశ్‌రెడ్డి పరామర్శించారు.



చైతన్యపురిలోని చైతన్య హైస్కూల్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



ఆర్‌కేపురంలో పూలు, ఇతర సామగ్రి కొంటున్న ప్రజలు



వనస్థలిపురం నారాయణ పాఠశాలలో..

బతుకమ్మ సందడి షురూ!

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని వివిధ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను వైభవంగా ప్రారంభించారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా పట్టువస్త్రాలను ధరించి బతుకమ్మలను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ..పండుగల నిర్వహించటం భవిష్యత్ తరాలకు మన సంప్రదాయాలను పరిచయం చేయటం వంటిదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పువ్వులు, వివిధ సామగ్రి కొనేందుకు వచ్చిన వారితో మార్కెట్లు, ఫుట్‌పాత్‌లు కిటకిటలాయి. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



బతుకమ్మలతో వివేకానంద పాఠశాల విద్యార్థులు



బతుకమ్మ, దసరా వేడుకల్లో పాల్గొన్న శ్రీత్రివేణీ పాఠశాల విద్యార్థులు



సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని కాకతీయ పాఠశాలలో విద్యానుల నృత్య ప్రదర్శన



ఆర్‌కేపురం... నారాయణ పాఠశాలలలో

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి వీకర్ సెక్షన్‌కాలనీ వరద ముంపునకు గురి కాకుండ శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వీకర్‌సెక్షన్‌కాలనీలో ఇళ్లలోని వరదనీరు చేరడంతో శనివారం ఆయన కాలనీలో పర్యటిస్తూ మాట్లాడారు. వరద కాలువ పనులకు రూ.80లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సీఆర్‌ఎన్‌క్లేవ్, శైలజాపురికాలనీ, కాస్మోపాలిటన్‌కాలనీలలోని డ్రైనేజీ మురుగు వీకర్ సెక్షన్‌కాలనీలోకి చేరుతుందని, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానన్నారు.

ఆర్థికసాయం అందజేత..

మన్సూరాబాద్: వీకర్‌సెక్షన్‌కాలనీవాసుల వరద నీటి సమస్యకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి త్వరలోనే శాశ్వత పరిష్కారం చేయనున్నారని డివిజన్ బీఆర్‌ఎస్ నేత జక్కిడి రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వీకర్‌సెక్షన్ కాలనీలోని పలు ఇళ్లలోకి వరదనీరు చేరింది.విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువనేత శనివారం కాలనీలో పర్యటించి వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు.

నేడు కర్మన్‌ఘాట్‌లో బతుకమ్మ సంబరాలు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ క్రాంతి యువజన సంఘం క్రీడా మైదానంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కర్మన్‌ఘాట్ శ్రీ సరస్వతీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ లెక్కల కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు 9000484952 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్వరరెడ్డి

మలక్‌పేట: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి డిగ్రీ కోఎడ్యుకేషన్ కాలేజీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఉద్భావ్–2025 పేరుతో శనివారం జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్లు డాక్టర్ పి.రాంరెడ్డి, సీతారామిరెడ్డి, ప్రిన్సిపాల్ టి. చిన్నారెడ్డి, జయచందర్, సుకన్య, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల రిమాండ్

హయత్‌నగర్: దొంగతనాలను పాల్పడుతన్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూలు జిల్లా కొల్హాపూర్ మండలం నర్లపూర్‌కు చెందిన మండ్ల శివ లేబర్ పని చేస్తూ కర్మన్‌ఘాట్‌లో ఉంటున్నాడు, పలు మార్లు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. జైలులో అతనికి సంతోష్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు క్యాబ్ డ్రైవర్ యల్ల బాలకృష్ణతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేస్తున్నారు. ఈ నెల 6న హయత్‌నగర్‌లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 6 తులాల వెండి వస్తువులు, 13న మునుగనూరులోని జయసూర్య నగర్ కాలనీలో అర్ధరాత్రి మరో ఇంటి తాళాలు పగులగొట్టి 32 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు దోచుకెళ్లారు. శివ స్నేహితుడు మోత్కూరు శ్రీకాంత్ సహకారంతో దొంగిలించిన నగలు ఎల్‌బీనగర్‌లోని ఓ షాపులో విక్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి భాగ్యలత సమీపంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని దొంగించిన సొత్తుతో పాటు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.

వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

● నాగోలు ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ



మాట్లాడుతున్న సీఐ నాగరాజు, వేదికపై సీఐ మక్బూల్ జానీ

నాగోలు: మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని నాగోలు సీఐ మక్బూల్ జానీ సూచించారు.బండ్లగూడ సహభావన టౌన్‌షిప్‌లో మహిళల కోసం శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా షీ టీమ్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) సైబర్ నేరాలు, మహిళల భద్రత, మానవ అక్రమ రవాణ, మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మక్బూల్ జానీ మాట్లాడుతూ.. మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు రావాలన్నారు. రాచకొండ షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. షీ టీమ్ వద్ద ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ హెల్ప్‌లైన్ 9490617111, డయల్–100, సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు, షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ అనూష, కౌన్సిలర్ స్రవంతి సరిత, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ మెంబర్ శోభారెడ్డి, సహభావన టౌన్ షిప్‌లో సీ–బ్లాక్ అధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాసరావు, సెక్రటరీ అబీద్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ సంధ్యారాణి పాల్గొన్నారు.

పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ పార్క్ ప్రజలందరికీ ఉపయోగపడేలా అభివృద్ధి చేశామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ, నాగేశ్వర్‌రావు కాలనీలో ప్రాంతంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పార్క్, ఓపెన్ జిమ్‌ను కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. స్థానికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన పార్క్, ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్కు అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం అవ్వడం, పార్క్‌ను శుభ్రంగా, క్రమంగా వాడుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ పార్కు అభివృద్ధిలో సహకరించిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ధన్యవాదాలు అన్నారు.

● కొత్తపేట పార్కులో నిర్వహించిన వనమహోత్సవంలో కార్పొరేటర్ పాల్గొని చెట్ల నాటి కాలనీ వాసులకు చెట్లు పంపిణీ చేశారు.

పేదలకు భరోసా సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: బడుగు బలహీన వర్గాల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాను ఇస్తుందని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీకి చెందిన కుంట గోపాల్‌రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం రాజశేఖర్‌రెడ్డి తన కార్యాలయంలో అందజేశారు.

అధికారులు నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు



షటిల్ కోర్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ క్రీడాల విభాగం అధికారుల నిర్లక్ష్యంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. సచివాలయనగర్ షటిల్ కోర్టులో సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు క్రీడాకారులు కార్పొరేటర్‌ను కలిసి విన్నవించగా శనివారం ఆయన షటిల్ కోర్టు పరిశీలించి మాట్లాడారు. ప్రతి నెల నిర్వహణకు డబ్బులు వసూలు చేస్తూ కూడా నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి షటిల్ కోర్టుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, మూర్తి, అనిల్, రాజేష్, జశ్వంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి



వేడుకులను ప్రారంభిస్తున్న బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్

నాగోలు: విద్యార్థులకు చాలా ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకొని స్థిరపడాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని అవంతి డిగ్రీ, పీజీ విద్యాసంస్థల ఫ్రెషర్స్ వేడుకలు నాగోలులోని కళ్యాణ లక్ష్మి గార్డెన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ..అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పదని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న భారతదేశం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయన్నారు. ఎన్‌టీవీ చీఫ్ ఎడిటర్, సీఈవో రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే సమయంలోనే ఒక లక్ష్యం ఏర్పర్చుకుని ఆ దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అవంతి విద్యాసంస్థలు చదువుతో పాటు ఉద్యోగావకాశాల కల్పనకు కృషి చేస్తోందన్నారు. వివిధ క్రీడాల్లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గరిమెల్ల శ్రీనివాస్, నిర్మల్‌కుమార్, గాయత్రి, ప్రియాంక, రాకేష్, జయప్రద పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను తొలగించిన నాయకులు



పెయింటింగ్స్ వేస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి యశ్పాల్ గౌడ్ అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి ఉన్న పోస్టర్లను తొలగించి పెయింటింగ్స్ వేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, భాస్కర్ గౌడ్, కిరణ్ కుమార్, వినోద్, కొర్లపల్లి రాజు, పవన్, వెంకట్, తరుణ్, శ్రీను పాల్గొన్నారు.

కృష్ణతులసీనగర్‌లో..

మలక్‌పేట: సేవాపక్ష కార్యక్రమాల్లో భాగంగా శనివారం మూసారంబాగ్ డివిజన్‌లో పార్టీ అధ్యక్షుడు కొప్పుల దినేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మాజీ కోశాధికారి టి. రమేష్‌రెడ్డి హాజరయ్యారు. కృష్ణతులసీనగర్ కమ్యూనిటీహాల్ పరిసరాలు శుభ్రం చేశారు. పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్త, చెదారం, వేపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించారు.

వైద్య శిబిరానికి స్పందన



మన్సూరాబాద్: స్వస్థ్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారంనాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.వైద్యాధికారిణి అమిత, డాక్టర్ అనీసా, డాక్టర్ శ్రవణ్, హెల్త్ సూపర్‌వైజర్ భూషన్ పాల్గొన్నారు.

'సదర్'కు రూ.10 కోట్లు కేటాయించాలి



సమన్వయ సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘాల నాయకులు

సైదాబాద్ : సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉత్సవాల నిర్వహణకు రూ.10 కోట్లు కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ కోరారు. శనివారం సైదాబాద్‌లో అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సదర ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవ మహాసభ పోరాట ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం గత సంవత్సరం సదర ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ యాదవ్, రవీంద్రనాథ్ యాదవ్, రాములు యాదవ్, బత్తుల మహేందర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మాణిక్ యాదవ్, నవీన యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి



మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

చంపాపేట: ఎన్నిక సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పింఛన్‌దారుల హక్కుల పోరాట సమితి సభ్యుల ఆధ్వర్యంలో చంపాపేట వార్డు కార్యాలయంలో వంగా మధుసూధన్‌రెడ్డిని కలిసి పించన్ పెంపుదల విషయంపై వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వృద్ధులు, వితంతులు, చేయూత పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, సురేష్, నర్సింగరావు, రాము, లక్ష్మి, శంకర్, నాయకులు రాజేష్, కళ్యాణ్ పాల్గొన్నారు.